విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 13, ఫిబ్రవరి 2024

రాంకో రైతులకు పంటనష్ట పరిహారం చెల్లించాల్సిందే..!

- బాధిత రైతులు సీపీఐ నాయకులు
- ధర్నాతో నిలిచిన టిప్పర్ల రాకపోకలు

విశాలాంధ్ర -కొలిమిగుండ్ల : రాంకో మైనింగ్ టిప్పర్ల దుమ్ముతో సాగుచేసిన పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని బాధిత రైతులు సీపీఐ నాయకులతో కలిసి ఆందోళనకు దిగారు. సోమవారం కల్వటాల సమీపంలోని రాంకో మైనింగ్ రస్తాపై టిప్పర్ల రాకపోకలను అడ్డుకొని నిరసన చేపట్టారు. మూడు సంవత్సరాలుగా రాంకో సిమెంట్ పరిశ్రమకు రాకపోకలు సాగించే టిప్పర్ల వలన దుమ్ము ధూళి పడుతూ సాగు చేసిన పంటలు దెబ్బతింటునాయని అన్ని శాఖల అధికారులకు,ఉన్నత అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు.నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకి రు 5 లక్షలు పరిహారం రాంకో యజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట పొలాల మధ్య మట్టి రస్తాపై రాంకో పరిశ్రమకు 100లాది టిప్పర్ల ద్వారా సిమెంట్ రాయిని తరలిస్తుండటంతో విపరీతంగా దుమ్ము పడుతుండడంతో పంటల దిగుబడి పడిపోయింది. గతంలో చీని పంట ఎకరానికి 15 టన్నుల మీద దిగుబడి వచ్చేదని దుమ్ముతో 10టన్నుల టన్ల దిగుబడి మాత్రమే వస్తున్నట్లు రైతులు తెలిపారు.దీంతో బాధిత రైతులు నష్టాలను మూట కట్టుకుంటున్నారు. ప్రభుత్వ ఉన్నత అధికారులతో పాటు రామ్కో యజమాన్యం దృష్టికి తీసుకువెళ్లిన ఎవరు పట్టించుకోకపోవడంతో కడుపు మండిన బాధిత రైతులుఆందోళనకు దిగారు. సీపీఐ మండల కార్యదర్శి సూర్యనారాయణ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మహేష్, రామకృష్ణ,బాధిత రైతులు రామ్మోహన్, జనసేన పెద్దయ్య, సుబ్బరాయుడు, నాగేష్, బాల పెద్దయ్య, చిన్న పెద్ద య్య, చంద్రమోహన్‌రెడ్డి తదిత రులు సిమెంట్ రాయిని తరలి స్తున్న లోడు టిప్పర్లను అడ్డుకొని రాకపోకలను బంద్ చేశారు. రాం కో సెక్యూరిటీ అధికారులతో వాగ్వి వాదానికి దిగారు. రాంకో అధికా రులు వచ్చి రైతులకు నష్ట పరి హారం చెల్లించే వరకు ఆందోళన విరమించమని వారితో తేల్చి చెప్పారు. స్థానిక పోలీసులు నిరసన స్థలానికి చేరుకుని సీపీఐ బాధిత రైతులతో మాట్లాడి నిరసననువిరమించాలని కోరారు. రామ్ కో ఉన్నతాధికారులు ప్రస్తుతానికి అందుబాటులో లేరని ఈనెల 16వ తేదీన బాధిత రైతులతో మాట్లాడే విధంగా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఏదేమైనా మొదటిసారిగా రైతుల్లో కదలిక వచ్చి రాంకో యజమాన్యం తీరు ఎండ గట్టడంపై ముందడుగు పడినట్లు ప్రజలు భావిస్తున్నారు.

గిరిజనులకు ఇళ్లస్థలాలు కేటాయించాల్సిందే -సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర- జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు గ్రామ గిరిజనులకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సిద్దేశ్వరం గ్రామగిరిజన కాలనిలో విద్యుత్, మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం. రమేష్‌బాబు, గిరిజన సమాఖ్య నాయకులు పుల్లన్నలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమం లో తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ కి సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని గిరిజనుల పట్ల ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. 80 బన్నూరు, సిద్దేశ్వరం గ్రామస్తుల గిరిజన సమస్యలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఇప్పటికే బన్నూరులో ఉన్నటువంటి గిరిజనులు స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వారన్నారు. సిద్దేశ్వరం గిరిజనులు మౌలిక సదుపాయాలు లేక అగమ్య గోచరంగా ఉన్నారని వారు అన్నారు. గిరిజనుల సమస్యలు పట్టించుకోకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తామని వారు అన్నారు.వైసీపీ ప్రభుత్వం గిరిజన సమస్యలను పరిష్కరించడంలో విఫలం చేసిందన్నారు. గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇంటి పట్టాలు ఇయ్యకపోతే ఆమరణ దీక్షకు పూనుకుంటామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నరసింహ లాజరు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీదారులకు అన్నదానం

విశాలాంధ్ర - నంద్యాల : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ డా.కే.శ్రీనివాస్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం స్పందన అర్జీదారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారిని పద్మజ ముఖ్యఅతిథిగా హాజరై స్పందన అర్జిదారులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, డీఎఫ్ఓ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : మండల కేంద్రమైన వాసవి బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సోమవారం కోవెలకుంట్లలో వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రహదారి భద్రతా మహోత్సవాల సందర్భంగా శుక్రవారం రోడ్డు ప్రమాదాలు- నివారణ చర్యలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతయ్య బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీలో గెలుపొందిన జి. ఆదిలక్ష్మి, వి. నాగాంజలి, కె. షహనాజ్‌లకు ప్రిన్సిపాల్‌రామసుబ్బారెడ్డితో కలిసి బహుమతులు అందజేశారు.

అహోబిలేశుడి సన్నిధిలో...

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ ఆహోబిలంలో సోమవారం మాజీ రాజ్య సభ సభ్యుడు గంగుల ప్రతాపరెడ్డి ఆయన తనయుడు గంగుల ఫణికృష్ణారెడ్డిలు లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. వేద పండితులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారి గోత్రనామాలతో స్వామివారికి అష్టోత్తర పూజలు, అమ్మవారికి కుంకు మార్చన పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దిగువ అహోబిలంలోని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

నంద్యాలలో ఆటో డ్రైవర్ ను చెప్పుతో కొట్టిన మహిళ

అవమానంతో పురుగుల మందు త్రాగి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర -నంద్యాల: నంద్యాలలో ఆటో డ్రైవర్ ను ఓ మహిళ చెప్పుతో కొట్టిందన్న అవమానంతో పురుగుల మందు తాగి ఓబులేసు అనే ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన నంద్యాల జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలీలా ఉన్నాయి. గత 30 సంవత్సరాలుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్న ఓబులేసు అనే వ్యక్తిని శివ నాగిరెడ్డి భార్య చెప్పుతో కొట్టిందంటూ కూతురు ఆరోపణ చేస్తోంది. బాధితుని బంధువులు కుటుంబ సభ్యులు. వివిధ ప్రజా సంఘాల వారి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. దాడికి పాల్పడిన మహిళ ఇంటిదగ్గర రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు పోలీసులు సర్ది చెప్పడంతో ఆందోళనను విరామించారు.

ప్రజలను మోసం చేసిన వైయస్ జగన్-జయసూర్య

విశాలాంధ్ర-నందికొట్కూరు: రాష్ట్రంలో ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేసి అధికారంలోకి వచ్చిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గిత్త జయసూర్య అన్నారు. సోమవారం నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డిల ఆదేశాల మేరకు దామగట్ల టీడీపీ గ్రామనాయకులు తిప్పారెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సిసెల్ ఆర్గనైసింగ్ సెక్రెటరీ గిత్త జయసూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా ఇంటింటికెళ్లి బాబు ప్రకటించిన మినీ మానిఫెస్టో గురించి ప్రజలకు వివరించి తెలిపారు.

సంక్షేమాభివృద్ధి వైసీపీ తోనే సాధ్యం

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : గ్రామాల అభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమం వైసీపీ తోనే సాధ్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలపరిధిలోని మీర్జాపురంలో జనరల్ జీవన్ మిషన్ ఓహెచ్ఆర్ ట్యాంక్,పైపులైను,గోర్మన్‌పల్లిలో సీసీరోడ్ల ప్రారంభోత్సం, పేట్నికోట - అంకిరెడ్డిపల్లి బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ పాపిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల కల్పన అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. కుల మత వర్గ ప్రాంతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అవుకు మండలంలోని కొండమీద గ్రామాల ప్రజలకు తాడిపత్రి పట్టణానికి వెళ్లేందుకు దగ్గరి మార్గమవుతుందన్నారు. సర్పంచు రామాంజనేయులు, ఎంపీటీసీ పులిప్రకాశ్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

19న యాగంటి క్షేత్రంలో వేలం పాట

విశాలాంధ్ర- బనగానపల్లె : మండల పరిధిలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం నందు ఈనెల 19న సోమవారం11 గంటలకు మరుగుదొడ్ల నిర్వహణ లైసెన్సు హక్కు, సెల్ ఫోన్లు, కెమెరాలు, లగేజీ భద్రపరచు లైసెన్సు హక్కు కొరకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.ఆసక్తి గలవారు ధరావత్ మొత్తము చెల్లించి బహిరంగవేలం నందు పాల్గొనవచ్చున్నారు. ఇతర వివరముల కొరకు ఆలయ కార్యాలయము నందు సంప్రదించగలరని తెలిపారు.

వీధిలైట్లకు మోక్షం ఎన్నడో..!

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని అప్పలాపురం గ్రామంలో గత రెండు నెలల నుంచి వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో గ్రామం మొత్తం చీకటిలో మగ్గుతున్నది. సాయంత్రం 6:30ల తర్వాత ఇంటిలో నుంచి బయట గ్రామ ప్రజలు సంచరించాలంటే చీకటిలో ఏం ప్రమాదం ముంచుకొస్తుందో నని భయపడుతున్నారు. రాత్రిపూట పాములు , దొంగలు వచ్చిన కనిపించిన పరిస్థితి నెలకొంది. ఏ ప్రమాదం సంభవించకముందే వీధిలైట్లు మరమ్మతులు చేసి చీకట్లు పారదొలాలని గ్రామ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

శెట్టివీడులో నీటిఎద్దడి

విశాలాంధ్ర-చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామంలోని బోర్లలో భూగర్భ జలం అడుగంటడంతో తాగు నీటికష్టాలు మొదలయ్యాయి. కాలనీలో కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో బోర్ల వద్ద గంటల తరబడి నిలబడి నీరు పట్టుకొనే పరిస్థితి నెలకొంది.అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ వస్తే జగన్ వెంట ఎవరూ ఉండరు

విశాలాంధ్ర - నంద్యాల : ఎన్నికల నోటిఫికేషన్ వస్తే జగన్ రెడ్డి వెంట ఎవరూ ఉండరని ఎమ్మెల్యేలతో పాటు అనేక మంది వైసిపీ నాయకులు టీడీపీ లోకి క్యూ కడతారని మాజీ మంత్రి, నంద్యాల నియోజకవర్గ ఇంచార్జి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. జగన్‌రెడ్డి భస్మాసురుడి లాంటి వాడని తన నెత్తిపైన తానే చేయి పెట్టుకున్నాడని వ్యాఖ్యానించారు. సోమవారం తెలుగు దేశం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఐదేళ్ళుగా యువతకు జగన్ ప్రభుత్వం చేసింది ఏమి లేదన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టు అయినప్పుడు యువత ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు చేశారన్నారు. ఐటి రంగాన్ని అభివృద్ధి చేసి.. అనేక మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించారని అందుకే చంద్రబాబు అరెస్టు అయితే ఐటీ ఉద్యోగులు రోడ్డెక్కారాని గుర్తు చేశారు. ప్రతి టీడీపీ యువనేత, ఓట్ ఫర్ సిబిఎన్ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ భూమా జగత్ విఖ్యత్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితే ఏటా 2.35 లక్షలు ఉద్యోగాలు ఇస్తామంన్నారని అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలండర్ ను మరిచారని విమర్శించారు. విదేశీ విద్య, ఫీజు రియంబర్స్‌మెంట్ వంటి కార్యక్రమాలు చేపట్టి పేద మధ్య తరగతి విద్యార్థులు కార్పొరేట్ స్థాయిలో చదువుకునే అవకాశాలు కల్పించామన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని స్కీమ్ లను ఎత్తివేసి అనేక మంది విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి తాతి రెడ్డి తులసిరెడ్డి మాట్లాడుతూ రాష్టం అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. జగన్ పాలనలో యువత పైన తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నరన్నారు.ఈ సమావేశంలో తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు శివ శంకర్ యాదవ్, కృపాకర్,టీడీపీ నాయకులు గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేసింది చంద్రబాబే

విశాలాంధ్ర - నందికొట్కూరు : గత టీడీపీ ప్రభుత్వంలో పసుపు కుంకుమ పేరుతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పొదుపు మహిళలను మోసం చేశారని ఏపీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి అన్నారు. సోమవారం మండలలోని గ్రామాలకు సంబంధించిన నాలుగవ విడత వైఎస్ఆర్ ఆసరా వార్షికోత్సవాలు చాముండి ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి, సమన్వయ కర్త డా.సుధీర్ దారా పాల్గొన్నారు. నాలుగవ విడత పొదుపు సహాయ సంఘాలకు 695 గ్రూపులకు రూ.5.15 కోట్ల మెగా చెక్కులను పొదుపు మహిళలకు అందజేశారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి ,సమన్వయ కర్త డా సుధీర్ దారా పొదుపు మహిళలతో కలిసి సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్ర పట్టాన్నికి పాలాభిషేకం చేశారు. అనంతరం శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డి దని అన్నారు.గత ప్రభుత్వంలో చంద్రబాబు మహిళలకు పసుపు కుంకుమ పేరుతో చంద్రబాబు మోసం చేశారని, ఎన్నికలప్పుడే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. బాబు పాలనలో కరువుతో ప్రజలు అల్లాడిపోయారని పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలనే సీఎం జగన్మోహన్ రెడ్డి మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎంపీపీ మురళీకృష్ణ రెడ్డి , జడ్పీటీసీ కరీమున్నిషా ,సొసైటీ చైర్మన్ లు మద్దూరు సతీష్ రెడ్డి ,మహేశ్వర రెడ్డి ,వైస్ ఎంపిపిలు పబ్బటి రవి,కట్టా మంజుల ,మార్కెట్ యార్ చైర్‌పర్సన్ షేక్ రాహత్‌జబ్బార్ ,వైసిపి నాయకులు వెంకట్‌రెడ్డి,వైసీపీ మండల కన్వినర్ రవి యాదవ్,మండల జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ జంగం రేవతి,సర్పంచులు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు,మండల అధికారులు,వైకేపి,పొదుపు సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మేము చేసిన అప్పులు ప్రజల ఖాతాల్లోకి..మీరు చేసిన అప్పులు ఎవరి జేబుల్లోకే..!

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అప్పులకు సంబంధించిన డబ్బులను నేరుగా డిబిటి ద్వారా పేద ప్రజల ఖాతాల్లోకి మళ్ళించామని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన అప్పులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని రాష్ట్ర జలవనుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గోల్డెన్ ఫంక్షన్‌హాల్‌లో వైయస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమానికి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత జగన్ కే దక్కుతుందన్నారు. బాబు భవిష్యత్తుకే గ్యారెంటీ లేదని ప్రజలకు ఏమి షూరిటీ ఇస్తారని వారు విమర్శిం చారు. రాబోయే ఎన్నికల్లో సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే జగనన్నను ఆశీర్వదించాలని వారు కోరారు. మండలంలో 291 పొదుపు గ్రూపులకు సంబంధించి నాలుగో విడత ఆసరా రూ.1.48 కోట్ల మెగా చెక్కును పొదుపు మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ దానం, జడ్పిటిసి కసాని పుణ్యలక్ష్మీదేవి, మండల వైసీపీ కన్వీనర్ చంద్రమోహన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు వెంకటరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, సర్పంచులు మేకల ఓబులేస్, గురుప్రసాద్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వైయస్ షర్మిలను విమర్శిస్తే ఊరుకోం- డీసీసీ అధ్యక్షులు లక్షినరసింహ

విశాలాంధ్ర-నంద్యాల : వైయస్ షర్మిలని విమర్శిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసింహ హెచ్చరించారు. నంద్యాలకు చెందిన రాజేష్ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకులక్ష్మీ నరసింహ, పార్లమెంట్ అబ్జర్వర్ బండి జకరయ్యలు పార్టీ కండువాకప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హెదా ఇస్తుందని వారు పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బిజెపిలు కలిసిపోయాయని, వారికి ఓటు వేస్తే బిజెపికి ఓటు వేసినట్లేనని, కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. రాజేష్ మాట్లాడుతూ గతంలో తాను కాంగ్రెస్ వాదినేనని, కాంగ్రెస్ పార్టీ లౌకిక పార్టీ అని, బిజెపి మతతత్వ రాజకీయాలకు చరమ గీతం పాడాలంటే రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు బోయ రమణ , అబ్దుల్ రెహ్మాన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అంగళ్ళ వేలం ద్వారా దేవస్థానంకు భారీగా ఆదాయం

విశాలాంధ్ర-పాణ్యం: ప్రముఖ శైవ క్షేత్రం మండల పరిధిలోని ఎస్.కొత్తూరులో వెలిసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానమునునందు పూలు,గాజులు, పటములు అంగళ్ళు ఒక సంవత్సరం కాలంనకు బహిరంగ వేళము సోమవారం ఆలయ పర్యవేక్షణ అధికారి శశి కుమార్, ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇవ్వొ రామకృష్ణ మాట్లాడుతూ పూల అంగడి ద్వారా నాలుగు లక్షల 11 వేల రూపాయలు ఆదాయం సమకూరిందన్నారు.గాజులు పటముల అంగళ్ల ద్వారా 68 వేల రూపాయలు హెచ్చు పాట ద్వారా ఆదాయం సమకూరుందన్నారు.గత సంవత్సరం కంటే ఈ వేళాల ద్వారా దేవస్థానమునకు ఆదాయం భారీగా వచ్చిందన్నారు.టెంకాయల అంగడి పాట కొన్ని అనివార్యకారణాల వలన వాయిదా వేశామన్నారు.కార్యక్రమంలో ఆలయ పెద్దలు మిలటరీ సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి,లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, పాటదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ మహాప్రాకార నిర్మాణానికి విరాళం

ప్రముఖ శైవ క్షేత్రం మండల పరిధిలోని ఎస్. కొత్తూరులో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం మహాప్రకార నిర్మాణమునకు రూ.2 లక్షలు భక్తులు విరాళం ఇచ్చినట్లు సోమవారం ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో భా గంగా భక్తుల సహకారంతో నిర్మిస్తున్న మహాప్రకార నిర్మాణమునకు నంద్యాల పట్టణం సాయిబాబా నగర్‌కు చెందిన జమ్మన్న ధర్మపత్ని రంగమ్మ కుటుంబ సభ్యులు రూ.2 లక్షల చెక్కును ఆలయ ఈవో రామకృష్ణ అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అభిషేకములు అర్చ నలు నిర్వహించి సత్క రించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు ఆలయ సిబ్బంది సుబ్బా రెడ్డి, లక్ష్మీ నారాయణ,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

విశాలాంధ్ర - నంద్యాల: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల నిరసనలో భాగంగా సోమవారం నంద్యాల్లో మున్సిపల్ కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు మాట్లాడుతూ నమ్మించి మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు పరచకపోవడాన్ని నిరసిస్తూ నంద్యాల పట్టణంలో మున్సిపల్ కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణకార్యదర్శి డి.శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు రంజిత్, కార్యదర్శి ప్రతాప్, సహాయ కార్యదర్శి శివరాముడు, ఉపాధ్యక్షుడు మస్తాన్, మహిళా నాయకురాలు మంగమ్మ, చిన్నమ్మ, జయమ్మ లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ ఇరువురు మృతి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : రెండు మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇరువురు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు మండల కేంద్రంలోని జమ్మలమడుగు సర్కిల్ సమీపంలో భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఎదురుగా రెండు మోటార్ సైకిల్ ఢీకొనడంతో కలవటాల గ్రామానికి చెందిన హర్షవర్ధన్ (24) కొలిమిగుండ్లకు చెందిన కే. సుబ్బరాయుడు (48)మృతి చెందారు. పని నిమిత్తం హర్షవర్ధన్ మోటార్ సైకిల్ పై స్వగ్రామం నుండికొలిమిగుండ్లకు వస్తుండగా సుబ్బరాయుడు బైక్ పై కొలిమిగుండ్ల నుండి కలువటాల వైపు వెళ్తుండగా పెట్రోల్ బంక్ కు ఎదురుగా ప్రమాదవశాత్తు రెండు మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో హర్షవర్ధన్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ సుబ్బరాయుడుని తాడపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి చెందడంతో విషాదం నెలకొంది.సుబ్బరాయుడు చాలాకాలంగా తీవ్ర వణుకుడు వ్యాధితో బాధపడుతున్నాడు. వణుకుడి వ్యాధి కారణంగా సుబ్బరాయుడి మోటార్ సైకిల్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అన్నప్రసాద వితరణకు విరాళాలు

మహానంది- విశాలాంధ్ర : మహానంది పుణ్యక్షేత్రంలో నిత్యం భక్తుల కోసం అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందజేశారు. సోమవారం మహానందికి చెందిన పిక్కిలి శివశంకర్ తండ్రి తిమ్మయ్య జ్ఞాపకార్థంగా రూ.10,116లు, అదే గ్రామానికి చెందిన పిక్కిలి శివప్రసాద్ కుమార్తె ఈశ్వర పూజిత పేరు మీదుగా రూ. 10,116 లు నిత్య అన్నదానానికి టెంపుల్ ఇన్స్పెక్టర్ రంగన్నకు అందజేశారు. భక్తులు విరాళాలు అందజేశారు. వారికి స్వామివారి ప్రసాదాలతో పాటు, బాండులను అందజేశారు.

చెన్నై బస్సు సర్వీసు ప్రారంభం

విశాలాంధ్ర-నంద్యాల రూరల్ : నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డిల చొరవతో నంద్యాల నుండి చైన్నై వెళ్లే ప్రయాణికుల అవసరం దృష్ట్యా నిత్యం నంద్యాల డిపో నుండి చైన్నై బస్సు సర్వీసు ప్రారంభించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రయాణీకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చౌడేశ్వరిదేవి గోపుర కలస ప్రతిష్ఠ

విశాలాంధ్ర- బనగానపల్లె : మండల పరిధిలోని నందవరంలో ఈనెల 10 నుండి 14 వరకు శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారిమహా కుంభాభిషేక మహోత్సవం జరుగుతున్న సందర్భంగా సోమవారం నాలుగు గోపురములకు కలశ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరైనెరు.కార్యక్రమంలో మాజీ చైర్మన్ పిఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి, భక్తులు, ప్రజలు, కలశాల దాతలు, అమ్మవారి దీక్షదారులు సమరసత సేవా ఫౌండేషన్ సంయోజకులు మరియు విశ్వహిందు పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానస్పదస్థితిలో మృతి

విశాలాంధ్ర -చాగలమర్రి : మండల కేంద్రమైన చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో ఆంజనేయులు(41) అనే వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడని ఎస్సై రమణయ్య తెలియజేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఆంజనేయులుకు చాగలమర్రికి చెందిన ఆదిలక్ష్మికి 2007లో వివాహమైంది. వీరిద్దరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వివాహం అనంతరం చాగలమర్రిలోనే హమాలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. మృతుడికి మద్యం సేవించే అలవాటుందని, గత రాత్రి ఇంటికి రాలేదని తెలిపారు. ఉదయం ఇంటికి సమీపంలో మిల్లులో విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి తల్లి పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడి ఒంటిపై గాయాలు ఉండడం, రక్తం కారడాన్ని గమనించిన మృతుడి తల్లి పలు అనుమానాలు వ్యక్తం చేస్తుంది. పోస్టుమార్టం అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్సై రమణయ్య తెలియజేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

చదువుల రామయ్య సర్కిల్‌గా నామకరణం చేయాలి- సీపీఐ

విశాలాంధ్ర-పత్తికొండ : పట్టణంలోని గుత్తి సర్కిల్ ప్రాంతాన్ని చదువుల రామయ్య సర్కిల్ గా నామకరణం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో మేజర్ గ్రామపంచాయతీ ఇన్చార్జి ఈవో నరసింహులుకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుగ్గలి మండలం మారెళ్ళలో గ్రామంలో జన్మించిన చదువుల రామయ్య సీపీఐ పత్తికొండ నియోజకవర్గ కార్యదర్శిగా, ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శిగా అనేక ప్రజా ఉద్యమాలను చేపట్టడం జరిగిందని, భూస్వాముల దగ్గర ఉన్న భూములను భూ పోరాటాల ద్వారా వేలాది ఎకరాలను భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేశారని గుర్తు చేశారు. పత్తికొండ నియోజకవర్గం నిత్యం కరువు కాటకాలకు గురవుతున్న ప్రాంతం అని, కరువును రూపుమాపేందుకు కృష్ణాజలాలను రాయల సీమకు మళ్ళించాలని, చదువుల రామయ్య నేతృత్వంలో చేపట్టిన ఉద్యమ ఫలితంగానే నేడు పత్తికొండ కు హంద్రీనీవాజలాలు రావడం జరిగిందన్నారు. జిల్లాలో ఫ్యాక్షన్ నివారణకు చదువుల రామయ్య కృషి చేశారన్నారు. పత్తికొండ ప్రాంత అభివృద్ధికి కృషిచేసిన భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు కామ్రేడ్ చదువుల రామయ్య సేవలను నేటి తరానికి తెలియజేసేలా గుత్తి సర్కిల్ కు చదువుల రామయ్య సర్కిల్ గా నామకరణం చేసేందుకు గ్రామపంచాయతీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు ఒకటో వార్డు మెంబర్ బి. సురేంద్ర కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్ విజయవంతం చేయండి

- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లాఅధ్యక్షులు జగన్నాథం
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నెప్ప

విశాలాంధ్ర – కోడుమూరు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు,కార్మిక చట్టాలను కాలరాస్తూ అమలు చేస్తున్న చట్టాలకు వ్యతిరేకంగా ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జగన్నాథం, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నెప్పలు పిలుపునిచ్చారు.సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి రాజు అధ్యక్షతన తెలుగుదేశం,సిపిఎం తదితర ప్రజాసంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జగన్నాథం,ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నెప్పలు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు చట్టాలను,కార్మిక చట్టాలను కాల రాస్తుందని పేర్కొన్నారు.ప్రధానమంత్రి మోడీ కేంద్రంలోని ప్రభుత్వ రంగ ఆస్తులను,కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టుతున్నాడని,వారి కోసమే ప్రత్యేకమైన చట్టాలను తీసుకొస్తున్నారని ధ్వజమెత్తారు. రైతుల భూములను లాక్కునే విధంగా,పారిశ్రామిక రంగాల్లో సమ్మెలు చేయకూడదనే విధానాన్ని తీసుకొన్నాడని విమర్శించారు.కేంద్రంలోని రైలు, విమానాయనం,ఆహార భద్రత, ఇన్సూరెన్స్ వంటి తదితర రంగాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి ప్రధానమంత్రి మోడీ దేశ ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు.దేశంలో అన్ని రైతు సంఘాలు కలిసి రైతు చట్టాల రద్దు కోసం 13 నెలలుగా ఢిల్లీలోని ప్రధాన రహదారులను నిర్బంధించిన కారణంగానే ప్రధానమంత్రి యూ టర్న్ తీసుకొని రైతు నల్లచట్టాలపై క్షమాపణలు కోరిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. దేశంలోని ఆస్తులను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నాడని, విశాఖ ఉక్కు అందుకు ఉదాహరణగా నిలిచిందన్నారు. మోడీ మూడవసారి అధికారంలోకి వస్తే దేశం అధోగతి పాలు కావలసి వస్తుందన్నారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి గఫూర్, సిఐటియు నాయకులు విరన్నలు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోడీని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓడించడానికి అందరూ కంకణబద్ధులు కావాలని,మోడీ చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహించే గ్రామీణ బంద్ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకులు హనుమంతప్ప, టిఎన్టియుసి నాయకులు గోపాల్ నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక హోదాను విస్మరించారని, పోలవరం పనులు నిలిచిపోయాయని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి సురేష్ కుమార్,అధ్యక్షులు మునిస్వామిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి తీరని ద్రోహం చేసిందన్నారు.ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ లో ప్రత్యేకమైన నిధులు కేటాయించలేదన్నారు. అదేవిధంగా వ్యవసారంగానికి తూట్లు పొడిచేలా వివిధ రకాల చట్టాలను తీసుకొస్తున్నారని చెప్పారు. యంత్రాలతో వ్యవసాయాన్ని చేస్తే కార్మికులకు పని దొరకని పరిస్థితులు ఏర్పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో టిడిపి నాయకులు బడేసాగౌడ్,మోటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు దూళ్ల భాస్కర్,నాగరాజు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రాముడు,రాజు, మునిస్వామి,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిమ్మప్ప,నాగేష్, ఏఐటీయూసీ నాయకులు చిన్న రాముడు,మధు,ఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, అంజి,హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు బజారి,సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

15న ఆత్మీయ సమ్మేళన సమావేశం

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు : ఫిబ్రవరి 15వ తేదీన కర్నూలు నగరంలో సాయంత్రం 5 గంటలకు సీపీఐ అగ్ర నాయకులు, పూర్వపు జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి కర్నూలు నగరానికి వస్తున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళన సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. సురవరం సుధాకర్‌రెడ్డి కి ఉమ్మడికర్నూలు జిల్లాతో ఎనలేని అనుబంధం ఉందని ఆయన కర్నూలు నగరంలోనే ఉస్మానియా కళాశాలలో చదువుకున్నాడని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం విశేష కృషి చేశాడన్నారు. ఫ్యాక్షన్ ముఠా రాజకీయాలకు,వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు.

ఫిబ్రవరి 15న కర్నూలు నగరంలో జరుగు ఆత్మీయ సమ్మేళనంలో వామపక్ష ఉద్యమ శ్రేయోభిలాషులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు,కార్మికులు ఉద్యోగులు,విద్యార్థి యువజనలు ప్రజలు వారి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

మున్సిపల్ కార్మికులు నల్ల రిబ్బన్ ధరించి విధులకు హాజరు

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు : గతనెలలో మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 16 రోజులపాటు మున్సిపల్ కార్మికులను సమ్మె చేపట్టడం జరిగిందని,ఈ సమ్మెతో ప్రభుత్వం దిగివచ్చి కార్మిక సంఘాల నాయకులతో న్యాయమైన సమస్యలను పరిష్క రిస్తాం తక్షణమే సమ్మెను విరమించాలని ప్రభుత్వం కోరడంతో కార్మికుల సమ్మెను విరమించడం జరిగిందనీ, కార్మికుల సమస్యల పరిష్కారం కై అనేక హామీలు ఇచ్చిన వాటి అమలకు జీవోలను విడుదల చేయ లేదని తక్షణమే జీవోలను విడుదల చేయాలని ఏఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 4 క్లస్టర్ లలో మున్సిపల్ కార్మికులు రుబ్బన్ ధరించి విధులకు హాజరు కావడం జరిగిందని ఏఐటీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి రంగన్న, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఎల్లప్ప,కౌల్ రాజ్,ముక్తర్, శివ,వీరేష్, తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కాలంలో మున్సిపల్ కార్మికుల సమ్మెను విరమిస్తే కాంట్రాక్ట్ కార్మికులకు రూ.21వేలు వేతనాలు, వెహికల్ డ్రైవర్స్‌కు 24వేలు వేతనాలు, కార్మికులు సమ్మె చేసిన 16 రోజులకు కూడా వేతనాలు ఇస్తాం, కార్మికులకు ప్రమాద శాతం మరణిస్తే రూ.7 లక్షల ఎక్స్ గ్రేషియో చెల్లిస్తాం, క్లాప్ ఆటో డ్రైవర్లకు 18,500 వేతనంతో పాటు రిటైర్మెంట్ అయిన కార్మికులకు రూ.లక్షతో పాటు నెలకు ?2000 పెన్షన్ ఇస్తామని అనేక హామీలు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. సమ్మెను విరమిచి నెలరోజులు దాటినప్పటికీ ఈహామీల అమలుకు ప్రభుత్వం నుండి ఎటువంటి జీవోలు విడుదల కాకపోవడంతో కార్మికులు నిరుత్సాహాన్ని గురవడం జరిగిందని, కాబట్టి తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించి జీవోను విడుదల చేయాలని లేనిపక్షంలో కార్మికులు ఓట్ల రూపంలో ప్రభుత్వానికి గుణపాఠం చెప్తారని వారు హెచ్చరించారు.మున్సిపల్ కార్మికులు అల్లాబకాష్, నాగప్ప, రంగడు, నరసప్ప, ఆరిఫ్, సల్మాన్, మునీంద్ర, యాకోబ్, దేవీపుత్ర, నభిషేర్, విక్రమ్, భీమన్న, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ఒప్పంద జీవోలు విడుదల చేయాలి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: మున్సిపల్ కార్మికుల సమ్మె ఒప్పంద జీవోలు వెంటనే విడుదల చేయాలని ఏపీమున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూలగం మద్దిలేటి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం కర్నూలు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలగం మద్దిలేటి, జి.చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలపై వెంటనే జీవోలు విడుదల చేయాలన్నారు. డ్రైవర్లకు 24,500, పారిశుద్ధ్య కార్మికులకు 21వేలు, క్లాపు ఆటో డ్రైవర్లకు 18500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో భవిష్యత్తులో అందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అంతకు ముందు కార్మిక సంఘం నాయకులు కమిషనర్ ఏ. భార్గవ తేజకు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో అవుట్‌సోర్స్ కార్మకుల సంఘం నాయకులు మాణిక్యం, సవారి, దేవ సహాయం, టాయిలెట్ కార్మిక సంఘం నాయకులు శాలు, జమీల్ వెంకటేశ్వర్లు సాయి, లక్ష్మీ, పద్మావతి, సుజాత,రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరికీ ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలి

విశాలాంధ్ర -హెరాళగుండ : జిల్లాలో కరువు కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు పదివేల రూపాయలు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని మండల రైతుసంఘంఅధ్యక్షుడు లింగంపల్లి వెంకటేష్ డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాలని సోమవారం తహశీల్దార్ ఏయం ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు.మండల రైతు సంఘం అధ్యక్షుడు లింగంపల్లి వెంకటేష్ మాట్లాడుతూ ఆల్ ఇండియా కిసాన్ సంగ్ పిలుపు మేరకు ఆందోళన చేపట్టామన్నారు. నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారంగా రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కర్నూలు, తుగ్గలి, క్రిష్ణగిరి మండలాలను కరువు మండలంగా గుర్తించాలని వలసలను అరికట్టడానికి ఉపాధి పనులు 200 రోజులు పెంచాలని కోరారు .కరువు తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతులు రూ.2 లక్షల రుణ మాఫీని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకుడు నాగరాజ్ ,పంపా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర – దేవనకొండ రూరల్ : కార్మికులకు, రైతులకు బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు, స్వామినాథన్ సిఫారసు మేరకు రైతులు పండించే పంటలకు పెట్టుబడికి 50% కలిపి మద్దతు ధర చట్టం, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, విద్యుత్ సవరణ బిల్లును రద్దుచేసి, స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని,విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేసి, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి, కనీస వేతనం రోజుకు 600 చెల్లించాలని కోరుతూ ఈనెల 16న రాష్ట్రవ్యాప్తంగా జరిగే గ్రామీణ బందిని జయప్రదం చేయాలని కార్మిక సంఘాలకు, రైతు సంఘాలకు, ప్రజా సంఘాలకు, రాజకీయ పార్టీలకు సంయుక్త కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు నిచ్చిందని తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన దేవనకొండ నందు సిఐటియు మండల కార్యదర్శి బి.అశోక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వ్య.కా.స జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం. నరసరావులు హాజరై.. పాలక ప్రభుత్వాల తీరును ఎండగట్టారు.ఉభయ రైతు సంఘం నేతలు వెంకటేశ్వర్లు, సూరి సంజన్న, విద్యార్థి, యువజన సంఘం నాయకులు రామాంజి, శ్రీను, ఉభయ యూనియన్ నాయకులు పాండు, బజారి, కెపి.రాముడు,లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలులో వైసీపీ విఫలం



విశాలాంధ్ర – కల్లూరు: ఎన్నికల హామీలను అమలు చేయడంలో వైసీపీ ఘోరంగా విఫలం చెందిందని రానున్న రోజుల్లో వైసీపీ అరాచకాలకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం అర్బన్ 34వ వార్డ్ ఆయేషా మస్జీద్ లైన్‌లలో బాబు శ్యూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీని కాలనిలో సమస్యలు తెలుసుకుంటూ, ఈ ప్రభుత్వ వ్యతిరేక విధాలనాలను తెలియజేస్తూ, చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తు, రాష్టం అభివృద్ధి బాటలో నడవాలి అంటే,వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, చంద్రబాబు నాయుడు ని, ముఖ్యమంత్రి గా చేసుకోవాలని ప్రజలకు గౌరు చరిత వివరించారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ యన్ వి రామకృష్ణ,జిల్లా కోశాధికారి పీయు మాదన్న,వార్డ్ నాయకులు దాకేష్‌గౌడ్, మొహమ్మద్ రఫీ,డివి చంద్ర,చంద్రన్న, సులేమాన్, అర్బన్‌వార్డ్‌ల ఉపాధ్యక్షుడు పెద్ద బీచపల్లి,పాణ్యం తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, పాణ్యం ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు యస్ ఫిరోజ్,జిల్లా కార్యదర్శి కేతురు మదు,దొడ్డిపాడు బాషా, సయ్యద్ ఖాసిం,అర్బన్ నాయకులు కే శ్రీనివాసరావు, మహిళలు సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

టెలికాం సెక్టార్ యువత ఉపాధి అవకాశాలపై సదస్సు

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : స్థానిక వెంకయపల్లి రవీంద్రా మహిళా ఇంజనీరింగ్ కళాశాల నందు పురోగమిస్తున్న టెలికాం రంగం, యువత ఉపాధి అవకాశాలు అనే అంశం పై సదస్సు నిర్వహించారు. వికసిత భారత్‌ఏ2047 లో భాగంగా కళాశాలలో జరుగుతున్న అనేక కార్యక్రమాలలో భాగంగా సోమవారం రీజినల్ హెడ్ టెలికాం సెక్టార్ స్కిల్ కౌన్సిల్, రిటైర్డ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఫ్లైట్ లెఫ్టినెంట్ నోముల ప్రసాద్ టెలికాం రంగంలో జరుగుచున్న విప్లవాత్మక అభివృద్ధి, దీనిద్వారా యువతకు ఉపాధి అనే అంశం పై చక్కగా ప్రసంగించారు.నేటియువత వారి నైపుణ్యాలతో దేశ పురోగతికి ఎలా భాగస్వామ్యులు కాగలరో చక్కగా వివరించారు. రోజురోజుకి పెరిగిపోతున్న సాంకేతిక విద్య విలువలతో యువత దేశం యొక్క అభివృద్ధికి చక్కటి బాటలు వేసి ప్రపంచ దేశాల్లో దేశం యొక్క కీర్తి ప్రతిష్టలు పెంపొందించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.జె. ఉషశ్రీ మాట్లాడుతూ అమ్రిత్ కాల్ విమర్శ- వికసిత భారత్‌ఏ2047 యొక్క ముఖ్య పాత్రను వివరించారు. యువతను ఉత్తేజ పరిచి వారికి దిశా నిర్దేశం చేసే ఇలాంటి కార్యక్రమాలు తమ కలశాలలో నిర్వహించడం పట్ల కళాశాల చైర్మన్ మోహన్ కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస మూర్తిలు హర్షంవ్యక్తం చేశారు.ఇన్నోవేషన్ కౌన్సిల్ కోఆర్డినేటర్ జయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీవీ విజయం కోరుతూ 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర -ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పరిధిలోని కడిమెట్ల గ్రామంలో రాబోవు ఎన్నికల్లో బీవీ జయ నాగేశ్వర రెడ్డి అఖండ మెజార్టీతో గెలవాలని కోరుకుంటూ కడిమెట్ల గ్రామ కమిటీ అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగు యువత నాయకులు చంద్ర, గ్రామ నాయకు లు రవి, షేకన్న, ఉరుకుందు గౌడ్, దరగయ్య, ఎన్టీఆర్ అభిమాన సంఘ నాయకులు పెద్దయ్య, రాళ్ల దొడ్డి గ్రామ నాయకులు తిమ్మయ్య, దస్తగిరి పాల్గొని గ్రామం లో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామికి 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో కడిమెట్ల గ్రామ ఎన్టీఆర్ అభిమాన సంఘ నాయకులు పెద్దయ్య, రాళ్ల దొడ్డి గ్రామ నాయకులు తిమ్మయ్య, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ..

విశాలాంధ్ర- దేవనకొండ : దేవనకొండ మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు దగ్గర సోమవారం సాయంత్రం దేవనకొండ సీఐ శ్రీనివాసులుఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసారు. ఈసందర్భంగా సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ వాహనదారులు సరైన పత్రాలు ఉంచుకోవాలని, లేని యెడల చట్ట పరమైన చర్యలు తప్పవు అని ఈ సందర్భంగా పేర్కొన్నారు దేవనకొండ పట్టణం పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని ఆ యొక్క లైసెన్స్ రద్దుకు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే వారి తల్లదండ్రులకు బాధ్యత వహించాలనీ హెచ్చరించారు. వాహనదారులు, రోడ్డు నియమాలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల సమీపిస్తున్న వేల వాహనాల్లో అక్రమ నగదు, తదితర వ్యవహారాలపై ప్రతేక నిఘా ఉంటుందని తెలిపారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు. సోమవారం కర్నూలు నగర పాలక కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సిసి రోడ్లు డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు మరుగుదొడ్ల సమస్యలపై ఎక్కువ మంది అర్జీలు కమిషనర్ కు అందజేశారు. ఇందిరా గాంధీ నగర్, చిత్రిబాగ్‌కు చెందిన ఇద్దరు టిట్కో గృహానికి చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కమిషనర్ కు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్చార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ శశిలత, ఎస్.ఈ వేణుగోపాల్, ఎంహెచ్ఓ విశ్వేశ్వర్‌రెడ్డి, కార్యాలయ ఇన్చార్జి కార్యదర్శి నాగరాజు, మేనేజర్ చిన్న రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

నీలకంఠశ్వరుడి సన్నిధిలో..!

విశాలాంధ్ర -గోనెగండ్ల : గోనెగండ్లలో వైసీపీ అభ్యర్థి బుట్ట రేణుక నీలకంఠశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చేనేతలతో కలిసి వారితో బుట్టరేణుక మాట్లాడుతూ వైసీపీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని మీరందరూ సహకరించాలని ఆమె కోరారు.మరో పక్కా బుట్ట రేణుక అల్లుడు డా. మాచాని సోమనాథ్ టీడీపీ నుంచి టికెట్ ఆశిస్తున్నారు.డా. మాచాని సోమనాథ్ గోనెగండ్లలో టీడీపీ నాయకులను,కార్యకర్తలను, కలిసి నన్ను ఆదరించాలని కోరుతున్నారు.అతేయి డాక్టర్ మాచాని సోమనాథ్ టీడీపీ టిక్కెట్ వస్తే, అత్త బుట్ట రేణుక, అల్లుడు డా. మాచాని సోమనాథ్ పోటీ రసవత్తంగా ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వైసీపీది అభివృద్ధి అజెండా

విశాలాంధ్ర -కర్నూలు సిటీ: వైసీపీది అభివృద్ధి అజెండా అని, గత టీడీపీ ప్రభుత్వంలో శిలాఫలకాల నిర్మాణాలు మాత్రమే చాలా బాగా జరిగాయని మేయర్ రామయ్య ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ లు ఎద్దేవా చేశారు.సోమవారం 46వ వార్డులో పలు కాలనీల్లో రూ.2.65 కోట్ల అభివృద్ధి పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకవర్గం వచ్చినా మూడేళ్ళలో రూ.720 కోట్లతో 1736 రకాల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు తాగునీటి ఎద్దడి నివారణ, క్లీన్ అండ్ గ్రీన్ వంటి పనులకు కూడా ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ముందెన్నడూ లేని విధంగా ఒక్కొక్క పార్కును ఒక ప్రత్యేకతతో అభివృద్ధి చేశామని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశామన్నారు.

టీడీపీ టికెట్ ఇస్తే పోటీకి సిద్ధం-డా. మాచాని సోమనాథ్

విశాలాంధ్ర -గోనెగండ్ల : టీడీపీ టీకేట్ ఇస్తే నేను పోటీకి సిద్ధంగా ఉన్నాని డాక్టర్ మాచాని సోమనాథ్ అన్నారు.సోమవారం గోనెగండ్ల మండల పరిధిలోని వేముగోడు గ్రామంలో మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డితో డా.మాచాని సోమనాథ్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా డాక్టర్ మాచాని సోమనాథ్ గోనెగండ్ల మండలంలో పుట్టపాశం, హెచ్ కైరవాడి, వేముగోడు, బైలుప్పుల, గంజిహళ్లి, గోనెగండ్ల గ్రామాల్లో టీడీపీ నాయకులుతో కలసి వారి తో చర్చలు జరిపారు.అలాగే నాకు టీడీపీ టీకేట్ ఇస్తే మీరందరూ నాకు సహకరించాలని కోరారు.

ఎమ్మిగనూరు టీడీపీ టికెట్ బీసీలకు ఇవ్వాలి: ఎమ్మిగనూరు టీడీపీ టీకేట్ బీసీలకు ఇవ్వాలని మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ పరమేశ్వర రెడ్డి, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ బాలబ్రమయ్యాచారి, మాజీ సర్పంచ్ రంగముని, గంజిహళ్లి పెద్ద లక్షన్న, బైలుప్పుల లక్ష్మి నారాయణ,రంగున్ భాషాలు అన్నారు. దీంతో గోనెగండ్లలో రాజకీయ వేడి ఎక్కింది. దీంతో డాక్టర్ మాచాని సోమనాథ్ గోనెగండ్ల లో మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ బాలబ్రమ్మయ్యాచారి, మాజీ మండల వైస్ ప్రెసిడెంట్ కుర్వ బుడ్డప్ప, టీడీపీ మండల టీన్ టీ యూ సీ చెన్నైరాయుడు, జిల్లా కళారంగ సాంస్కృతిక విభాగ ఉపాధ్యక్షులు కౌలుట్లయ్య నాయుడు, వారిని కలసి నాకు టీడీపీ టీకేట్‌వస్తే ఆదరించాలని కోరారు. టీడీపీ అధికారంలో వస్తే అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పుష్కలంగా ఉంటాయన్నారు. చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టీటీడీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నీరు తాగలంటే కేంద్రం అనుమతి తీసుకోవాలా..!

విశాలాంధ్ర-నందవరం: నీరు తాగాలంటే కేంద్రం బ్రభుత్వం అనుమతి తీసుకోవాలా...., తెలుగు రాష్ట్రాలకు త్రాగునీరు సాగునీరు కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం పెత్తనం ఏంటని ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఈ సందర్భంగా మాట్లాడుతూ. 74 సంవత్సరాల కిందట కేటాయింపులు జరిగిన ఆర్డీఎస్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ 2 లోకి తీసుకురావడం ఏంటని నారాయణరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్ని రాష్ట్రాల నీటి కేటాయింపులు ఆ రాష్ట్రా ప్రభుత్వాల ఆధీనంలో పెట్టీ , రెండు తెలుగు రాష్ట్రాల నీటి కేటాయింపులు మాత్రం కేంద్ర ప్రభుత్వం అధీనంలో పెట్టుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ సమస్యను అతి త్వరగా తేల్చాలని కోరారు. కర్ణాటక రాష్ట్రం ప్రాజెక్టులు నిర్మాణాలు మొదలు పెట్టుకోవడం జరుగుతుంది అని అన్నారు. కానీ తెలుగు రాష్ట్ర లలో ప్రాజెక్టులు నిర్మాణం చేపట్టలంటే కేఆర్ఎంబి 2 వారి నిర్ణయం కోరారు ఎదురు చూడటం దారుణమని అన్నారు. కేంద్రం అనుమతులకొరకు గత 4 సంవత్సరాలుగా ఎదురుచూసే కర్మ తెలుగు ప్రజలకు పట్టిందని అవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు కర్నూల్ టీడీపి నాయకులు మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి , మంత్రాలయం టీడీపి నాయకులు తిక్కా రెడ్డి , లు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దగ్గరికి వెళ్లి ఈ ప్రాజెక్టులకు అనుమతులు సాధించి సర్వే లు ముగించి టెండర్లు వేయించడం జరిగింది. ఆర్డీఎస్ గుండ్రేవుల వేదవతి లకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కే ఆర్ ఎం బి 1 అనుమతులు ఇవ్వడం జరిగిందని, ఆ ప్రాజెక్ట్ లకు టెండర్లకు పిలవడం కూడా జరిగిందని,అయితే ఆ ప్రాజెక్టులను కే ఆర్ అమ్ బి 2 లోకి పెట్టీ, కేంద్ర ప్రభుత్వం రాయలసీమ రైతాంగం జీవితాలతో ఆడుకోవడం జరుగుతుందని అన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు ఎమ్మెల్యే లు ఎంపిలు ఈ ప్రాజెక్టుల గురించి కానీ కేఆర్ఎంబి 2 పైన కానీ కేంద్రంతో మాట్లాడిన పాపాన పోలేదని ప్రస్తుతం వైసీపీ ఇన్చార్జి లు టీడీపి అభ్యర్థులు మేమే అని చెప్పే వారు ఈ విషయం అయిన అవగాహన ఉందా ... ఉంటే ప్రజలకు ఏ హామీ ఇస్తారో చెప్పాలన్నారు.

స్పందన కార్యక్రమానికి 76 ఫిర్యాదులు

విశాలాంధ్ర – కర్నూలు జిల్లా పరిషత్ : కర్నూలు నగరంలోని కొత్తపేటలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యా లయంలో నిర్వహించిన స్పందనకు 76 ఫిర్యాదులు వచ్చాయనీ జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ సోమవారం తెలిపారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల్లో కొన్ని ..నాపొలాన్ని అన్యాయంగా రిజిస్టర్ చేసుకోవాలని సాగులోనిజొన్న పంటను కొందరు వ్యక్తులు దొంగలించుకున్నారంటూ హెరాళగుంద మండలం హెబ్బటంకు చెందిన మహేష్.. ఇంటికి రస్తా లేకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండల కేంద్రమైన ఆస్పరికి చెందిన షేక్షావలి.. మామిదలపాడులోని లాండ్రి స్థలంలోకి అక్రమంగా ప్రవేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కర్నూలు, సంతోష్ నగర్‌కు చెందిన మల్లికార్జున ఫిర్యాదు చేశారు. ఆర్మీఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నంద్యాల జిల్లా, ఆత్మకూరు కు చెందిన దుర్గ ప్రసాద్ రూ. 7 లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు, బాలజీ నగర్‌కు చెందిన తాహెరా, సాజిదాలు ఫిర్యాదు చేశారు.ఆన్ లైన్ బిజినెస్ చేస్తూ ఉంటే గుర్తు తెలియని వ్యక్తులు నా ఖాతా నుండి రూ. 80 వేలు తీసుకొని మోసం చేశారని న్యాయం చేయాలని కర్నూలు కు చెందిన హెబ్సిబా ఫిర్యాదు చేశారు. కుమారుడు అన్నం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు, కుమ్మరి గేరి కి చెందిన నాగరాజు ఫిర్యాదు చేశారు.

మంచినీటి ఎద్దడి లేకుండా చూస్తాం

విశాలాంధ్ర – హెరాళగుంద : మండలంలోని నేరనికి దేవరగట్టులో సోమవారం మంచినీటి బోరును వైసీపీ నాయకుడు సోమప్ప ప్రారంభించారు. దేవరగట్టు భక్తుల కోసం గోనెగండ్ల కు చెందిన భక్తుడు మోహన్ చంద్ర ఆచారి విద్యుత్తు మోటార్ తో పాటు స్టార్టర్ పైపులను విరాళంగా అందించినందుకు మోటర్ ను బిగించి భక్తులకు ప్రజలకు త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించామన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామని భక్తులు నీటిని వృధా చేయకుండా ట్యాంకులను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వీర నాగప్ప, రాముునాయక్, మంజు నాయక్, సాధన్న, లైన్మెన్ జయరాంనాయక్, పూజారులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 13, ఫిబ్రవరి 2024

వైసీపీ నుంచి టీడీపీలోకి

విశాలాంధ్ర –చాగలమర్రి : మండలంలోని గొడిగనూరులో 50 కుటుంబాలు వైసీపీ నుంచి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన సూర్యనారాయణ, చిన్ననరసింహులు, అంకాలు, బాలకృష్ణ, సంతోష్, వెంకటసుబ్బయ్య పాటు మరో 45 కుటుంబాలు మాజీ మంత్రితో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ పై నమ్మకంతో పార్టీలోకి వలసలు వస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఏ అభివృద్ధి పని చేయాలన్న భూమా కుటుంబమే అని నమ్మి గ్రామాల్లో ప్రజలు తమ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఆమె వివరించారు.ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గ ప్రజల సమస్యలపై ఏనాడైనా అసెంబ్లీలో ప్రశ్నించారా అని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, భార్గవ్ రామ్ నాయుడు,టీడీపీ మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి,టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు,మాజీ సర్పంచ్ దేశంరెడ్డి, శేఖర్‌రెడ్డి, రామసుబ్బయ్య, ప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరసింహులు, ప్రమోద్, రవి, రామచంద్రారెడ్డి, బ్రహ్మం, శ్రీనివాసరెడ్డి, రామక్రిష్ణ, కొలిమి హుసేన్‌వలి, షరీఫ్, సల్లా నాగరాజు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు

జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు

విశాలాంధ్ర - నంద్యాల: జిల్లాలోని అర్హత ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 535 లోని మార్గదర్శకాల మేరకు ఇళ్ళ స్థలాలను మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో ప్రభుత్వం జర్నలిస్టులకు అందజేస్తున్న హౌస్ సైట్స్ కు సంబంధించి జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డిఆర్ఓ ఎ. పద్మజ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ జి.ఓ.ఎం.ఎస్ నెంబర్ 535 లో ఉన్న అన్ని నిబంధనలను పాటించి అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో అర్హత ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్స్, వెటరన్ పాత్రికేయులకు ప్రభుత్వ ఉత్తర్వులలో పొందుపరిచిన అర్హతలు, నిబంధనల ప్రకారం దరఖాస్తులు పూర్తి చేసిన వారికి హౌస్ సైట్స్ కేటాయిస్తామన్నారు. 5 సంవత్సరాల అక్రిడేషన్ అనుభవం కల్గిన వారిని కమీషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, విజయవాడ వారు గుర్తించి పంపిన ప్రాథమిక జాబితాను పరిశీలించిన అనంతరం తుది జాబితా మేరకు ఇంటి స్థలాలివ్వడం జరుగుతుందన్నారు.సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్, విజయవాడ వారి కార్యాలయం నుంచి ప్రాథమిక వెరిఫికేషన్ జరిగి జిల్లాకు 328 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. జిల్లాకు వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత జాబితాను ఆయా నియోజకవర్గాల తహసిల్దార్ లకు పంపించి పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అర్హత ఉన్న వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించేందుకై అవసరమైన ప్రభుత్వ భూములు లేదా అసైన్మెంట్ ల్యాండ్, పట్టా భూములను గుర్తించి గురువారం లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత ఆర్డిఓలను ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి మీడియా జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులు అందరికీ స్థలాలు ఇవ్వాలని కోరారు. వరుసగా ఐదేళ్లు అక్రిడిటేషన్ ఉండి ఏదైనా కారణం చేత ఈ ఏడాది అక్రిడిటేషన్ రాకపోతే వారిని కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఐఅండ్ పీఆర్ డిపిఆర్ఓ మల్లికార్జునయ్య, డోన్ ఆర్డీఓ మహేశ్వర రెడ్డి, నంద్యాల, ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయాల అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, కలెక్టరేట్ బి. సెక్షన్ సూపరింటెండెంట్ జ్యోతి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

హాకీ ఛాంపియన్ కడప బాలుర జట్టు

విశాలాంధ్ర –కర్నూలు సిటీ: స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్డోర్ స్టేడియంలో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఫైనల్లో కడప జట్టు 2-1 గోల్స్‌తో అనకాపల్లి జిల్లాపై నెగ్గి ఛాంపియన్షిప్ సాధించింది కాగా రన్నర్ గా అనకాపల్లి నిలిచింది. పశ్చిమగోదావరి కి మూడవ స్థానం కర్నూలుకు నాలుగో స్థానం దక్కింది.గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి. శంకర్ శర్మ, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బి. రామాంజనేయులు కలిసి విజేతలకు ట్రోఫీలు పతకాలు, ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. డా.బి శంకర్ శర్మ మాట్లాడుతూ ఓటమితోనే గెలుపు సాధ్యమవుతుందన్నారు. క్షణికావేశంతో ఈ మధ్యకాలంలో చిన్న పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడాకారులు శరీర సౌష్టం ఆరోగ్యంతో పాటు అటువంటి క్షణికావేశాల గురికాకుండా క్రీడా స్ఫూర్తిని చాటి పదిమందికి ఆదర్శంగానిలుస్తున్నారని ఆయన కితాబిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హాకీకరణం కార్యదర్శి దాసరి సుధీర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్, హాకీ ఆంధ్ర ప్రతినిధి థామస్ పీటర్, ఎక్సైజ్ శాఖ మేనేజర్ విశ్వమోహన రెడ్డి, వినోద్ జోషి, క్రీడా సంఘ ప్రతినిధులు శ్రీనివాసులు, గంగాధర్ లతోపాటు సీనియర్ క్రీడాకారులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ - సూపర్ సిక్స్ పథకాలపై సమీక్ష

విశాలాంధ్ర– కోవెలకుంట్ల : మండల కేంద్రమైన కోవెలకుంట్లలో సోమవారంతెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ బూత్ ఇంచార్జ్,యూనిట్ ఇంచార్జి లకు, క్లస్టర్ ఇంచార్జ్ లకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు తో సమావేశమై బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ సూపర్ సిక్స్ పథకాల గురించి సమీక్ష సమావేశం నిర్వహించిన బనగానపల్లె మాజీ శాషణ సభ్యులు బీసీ జనార్దన్ రెడ్డి. వారికి దిశ నిర్దేశం చేస్తూ కోవెలకుంట్ల పట్టణంలో జరగబోయే ఇంటింటికి బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం గురించి బూత్ ఇంచార్జ్లకు, యూనిట్ ఇంచార్జి లకు, క్లస్టర్ ఇంచార్జ్ లకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు వివరించి, ప్రతి ఇంటింకి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను తీసుకొని వెళ్ళాలి అని సూచించారు.అంతే కాకుండా వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న దౌర్జన్యలను ప్రజలకు వివరించాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి సూన్యమని, గొప్పలు తప్ప వాస్తవికతలో అభివృద్ధి లేదు అని వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల విషయంలో పేద ప్రజలను మరిచి కేవలం వైసీపీ వర్గం వారికే సంక్షేమ పథకాల లబ్ది చేకూరుస్తున్నారు అని వివరించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని కోవెలకుంట్ల మండలం నాయకులకు, బూత్ ఇంచార్జ్లకు, యూనిట్ మరియు క్లస్టర్ ఇంచార్జ్ లకు దిశనిర్దేశం చేశారు బీసీ జనార్దన్ రెడ్డి, ఈ కార్యక్రమం లొ కోవెలకుంట్ల మండల కన్వీనర్ మద్దిలేటి, టీడీపీ నాయకులు పేరా శ్రీధర్ రెడ్డి, ఎరుకల శేఖర్, కర్రిమద్దిల మురళి, నాగేంద్ర మరియు ఇతర పట్టణ నాయకులు, బూత్ ఇంచార్జు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర –ఆత్మకూరు టౌన్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న షాదీఖానా పనులను వైసీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్-ఆసరా చెక్కులు పంపిణీలో ఎమ్మెల్యే కాటసాని

విశాలాంధ్ర– కల్లూరు: మహిళల అభివృద్ధి వైకాపాతోనే సాధ్యమవుతుందని మహిళల సంక్షేమం కోసం కోట్ల నిధులు వేచించి వారి జీవన ప్రమాణాలను పెంచి మహిళల పక్షపాతిగా నిలిచిన వ్యక్తి సీఎం జగన్మోహన్ రెడ్డి అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కల్లూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మండల ఏపీఎం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో 4వ విడత ఆసరా నిధుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో రమణమూర్తి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మండల అధ్యక్షురాలు శారద ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలకు ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసరా నాలుగవ విడత స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళల ఆర్థిక ఇబ్బందులను 36.48 కిలోమీటర్ల పాదయాత్ర లో కళ్ళారా చూసి చలించి 11 ఏప్రిల్ 2019 ఎన్నికల హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నికల రోజు వరకు అక్క చెల్లెమ్మలకు పొదుపు సంఘాల బ్యాంకు రుణాల మొత్తము ఎస్ ఎల్ బి సి వారి ద్వారా తుది జాబితాను తెప్పించుకొని 7.97 లక్షల మహిళలకు 78.76 లక్షల అక్క చెల్లెమ్మలకు ఉన్న అప్పు నిల్వలను 25,517 కోట్లను నాలుగు దఫాలుగా నేరుగా పొదుపు సంఘాల ఖాతాలోకి జమ చేయాలని నిర్ణయించి, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నవరత్నాల్లో వై యస్ ఆర్ ఆసరా పథకంలో చేర్చడం జరిగిందన్నారు. మహిళల జీవితాల్లో మరిన్ని కాంతులు తీసుకురావాలని, సుస్థిరమైన ఆదాయాన్ని పొంది.మీకు మీరుగా సృష్టించుకునే వ్యాపారం , జీవనోపాదులు అవకాశాలకు కేటాయించిన నగదును ఉపయోగపడేలా చేసిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రిని అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది లక్షాధికారులు కావలెనని మంచి ఆలోచనతో ఈ పథకాన్ని 12/02/2024 నాడు ఆసరా పథకాన్ని నాలుగవ విడత ను ప్రారంభించడం జరిగిందన్నారు.పాణ్యం అసెంబ్లీ నియోజక వర్గం వారిగా వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత 1704 స్వయం సహాయక సంఘాలకు మొత్తం సభ్యులు 15,797 కి గాను అమౌంట్ 10.23 కోట్లును జమ చేయడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం ఏపీఎం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కల్లూరు మండలం లో వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత 831 స్వయం సహాయక సంఘాలకు మొత్తం సభ్యులు 8,621 మొత్తం అమౌంట్ 4.94 కోట్లును జమ చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో రమణమూర్తి, ఏపీఎం శ్రీనివాస్ గౌడ్, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు , మండల సమాఖ్య పాలక వర్గం పొదుపు మహిళలు, %జజ% లు, గ్రామీక సంఘం లీడర్లు, బుక్కీపర్లు, పొదుపు మహిళలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అహోబిలేసుడి సేవలో ప్రముఖులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : అహోబిల లక్ష్మీనరసింహ స్వామి పార్వేట వేడుకల్లో భాగంగా సోమవారం పల్లకిలో కొలువైన ఉత్సవ మూర్తులు సర్వాయిపల్లె గ్రామం నుంచి ఆళ్లగడ్డ చేరుకొని మొదటగా ఎం.వి.నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయ తెలుపు వద్ద అధికారుల పూజలు అందుకున్నారు. తర్వాత ఆళ్లగడ్డ అగ్నిమాపక దళం అధికారులు పూజలు నిర్వహించారు. అనంతరం డిఎస్పి కార్యాలయం వద్దకు ఉత్సవ పల్లకి చేరుకోగానే రూరల్ సీఐ హనుమంత నాయక్, ఎస్సై నరసింహులు తోపాటు సబ్ డివిజన్‌లోని పోలీసు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు కాసేపు ఉత్సవ పల్లకినీ మోశారు.

దేవస్థానం ధర్మకర్తగా శైలజ ఎన్నిక

విశాలాంధ్ర –నంద్యాల రూరల్: మండలంలోని కానాల గ్రామంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎన్నిక చేశారు. ఈ నూతన కమిటీలో నంద్యాల మండలం కానాలకు చెందిన చిన్నచెన్నప్ప సతీమణి శైలజతో పాటు మిగతా ఐదుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ కానాలలో వెలిసిన అతి పురాతనమైన ఎంతో ప్రసిద్ధి చెందిన చరిత్ర గల దేవాలయం నన్ను ధర్మకర్తగా ఎన్నిక చేసిన ఎమ్మెల్యేకు, కానాల గ్రామపెద్దలు మాజీ కె.డి.సి.సి. బ్యాంక్ చైర్మన్ యం. జగదీశ్వర రెడ్డి,నంద్యాల మార్కెట్‌యార్డ్ మాజీచైర్మన్ యం.విజయశేఖర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎండోమెంట్ పాలకమండలి సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పేద బలిజల అభ్యున్నతి కోసమే సంఘం ఏర్పాటు-అధ్యక్షుడు రామన్న

విశాలాంధ్ర –అవుకు: పేద బలిజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని లక్ష్యంతోనే శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం ఏర్పాటయిందని సంఘం అధ్యక్షుడు కునుకుంట్ల రామన్న అన్నారు. సోమవారం సంఘం ప్రథమ వార్షికోత్సవ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్న ఈసీ మెంబర్లు మరియు వార్డు మెంబర్లను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవ సంఘం ఏర్పడి సంవత్సరం కాలం పూర్తయిందని ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. సంఘం ఏర్పడినప్పటి నుండి బలిజ కులస్తులకు ఏదో ఒక సహాయం చేయాలన్న ఉద్దేశంతో చనిపోయిన ప్రతి వ్యక్తికి ఐదువేల రూపాయలను మరణించిన వ్యక్తి యొక్క కుటుంబానికి అందజేస్తున్నామని అన్నారు. అలాగే ప్రమాదానికి గురైన వారికి పదివేల రూపాయల నుండి 15 వేల రూపాయల వరకు వారి కుటుంబ పరిస్థితులను బట్టి ఇస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు సంఘం తరవున మూడు లక్షల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని అన్నారు. సంఘం సభ్యుల సహకారంతో ముందు ముందు మరిన్ని మంచి సేవలు చేస్తామని అన్నారు. ఉపాధ్యక్షుడు ఆల్వా కృష్ణమూర్తి మాట్లాడుతూ బలిజ సంఘం ఏదో ఆశించి పెట్టింది కాదని పేద బలిజ కులస్తులకు సరైన న్యాయం జరగకపోవడంతో సంఘం ఏర్పాటు చేసుకొని పేదవారికి తమ వంతుగా మేము సహాయం చేయాలని ఉద్దేశంతోనే ఈ సంఘం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. కొందరు వ్యక్తులు ఈ సంఘాలను వేరు చేయాలని చాలా ప్రయత్నం చేస్తున్నారని వారు తల కింద తపస్సులు చేసిన బలిజ సంఘం వేరు చేయలేరని అన్నారు. ఎన్నో సంఘాలు వస్తుంటాయి పోతుంటాయని కానీ శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం మాత్రం ఎన్ని ఏళ్ళు ఉన్నా ఇదే విధంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కంపిలి నారాయణ,మండల వైస్ ప్రెసిడెంట్ జానపాటి ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ రమణ, సలహాదారుడు శనిగల వెంకటేష్, ట్రెజరీ జక్కా మధు, చిరుతనూరు వేణు, ఎల్లనూరు సుబ్బయ్య, గుర్రాల రామాంజనేయులు, కునుకుంట్ల హరి, కండక్టర్ శ్రీనివాసులు,ఉపేంద్ర,బుగ్గ నాగార్జున, గుడిపాటి అరవింద్, కోనేటి శ్రీనివాసులు, జయ నాగేంద్రప్రసాద్, ఈసీ మరియు వార్డు సభ్యులు, బలిజ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

మండల విద్యాధికారిని తక్షణమే విధుల నుండి తొలగించాలి

విశాలాంధ్ర–ప్యాపిలి: అవినీతికి పాల్పడిన అధికారికి వత్తాసు పలుతుకుతున్న మండల విద్యాధికారిని తక్షణమే విధుల నుండి తొలగించాలని సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్య ప్రతాప్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు సూర్య ప్రతాప్ మాట్లాడుతూ గత కొంతకాలంగా ప్యాపిలి పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో అవినీతి జరిగిందని సాక్ష్యాలతో అధికారులకు అందించగా వారు స్పందించి ఆ పాఠశాలను సందర్శించి ఆ పాఠశాలలో ఎలాంటి అవినీతి జరగలేదని, ప్రధానోపాధ్యాయులు సరళాదేవితో, మధ్యా హ్న భోజన పథకం నిర్వాహకులతో కుమ్మక్కై , మండల విద్యాధికారి వెంకటేష్ నాయక్ తప్పుడు రిపోర్టు ఎంపీడీవోకి అందజేశామన్నారు. కంప్లైంట్ దారులు లేకుండా ఏ విధంగా విచారణకు పోతారని సూటిగా ప్రశ్నించారు. ఎలాంటి రెండు రికార్డులు మెయింటెన్ చేయలేదని, ఆరో ప్లాంటు పనిచేస్తుందని, విద్యార్థులకు డబ్బులు ఎక్కువై బయట నుండి వాటర్ ప్యాకెట్లు కొనుక్కొని కుంటున్నారని, మధ్యాహ్నం భోజనం విద్యార్థులు తింటున్నారని క్యారియర్ తెచ్చుకున్న విద్యార్థులు వారి ఇండ్లలో ఫంక్షన్ ఉన్నప్పుడు ఇంటి దగ్గర నుండి స్పెషల్ గా తెచ్చుకుంటున్నారని వెంకటేష్ నాయక్ రిపోర్ట్ ఇచ్చారు. పాఠశాల విద్యార్థులు 60% వాళ్ళ ఇండ్లలో స్కూల్‌లోని రోజు మాత్రమే ఫంక్షన్లు జరుగుతున్నాయా ప్రపంచంలోని ఎక్కడ వింత మనం బాలికల పాఠశాల జరుగుతుందని ఆయన అన్నారు. దీనికి సంబంధించి అధికారి తనిఖీ చేస్తే అసలు విషయం బయటపడుతుందని అంతేకాకుండా ఇంతవరకు ఆరో ప్లాంట్ కు కరెంటు కలెక్షన్ లేదు ఏ విధంగా పనిచేస్తుందని విద్యార్థులకు డబ్బులు ఎక్కువ అయ్యి బయట నుండి నీళ్ళు తెచ్చుకోవడం లేదు తాగడానికి నీళ్లు లేకనే వాటర్ ప్యాకెట్లు తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారనీ, వారు ఉపయోగిస్తున్న దొంగ రికార్డులు కూడా వీడియోలు, సాక్షాలతో అధికారులకు అందజేస్తే వారితో కుమ్మక్కై ఇలా చేస్తారని విద్యార్థులు కడుపు కొడతారని ఏ రోజు కూడా వారు ఊహించలేదని తెలిపారు. ఇలాంటి వారిని అధికారులుగా చేపడితే మండలంలోని అవినీతి పెరిగిపోతుందని, కావున ప్యాపిలి మం డల ఎంఈవోని తక్షణమే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. తక్షణమే దీనికి సంబంధించిన అధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివ కేశవులు, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రనాయక్, పవన్, భాష ,మనోజ్, వరుణ్ సందేశ్, తనీష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు : నగర అభివృద్ధిలో యువత భాగస్వామ్యం అవ్వాలని కర్నూలు నియోజకవర్గ ఆపార్టీ ఇంచార్జి టి.జీభరత్ అన్నారు.సోమవారం నగరంలోని శంకరాస్ డిగ్రీకళాశాలలో యువగళం పేరుతో యువదతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎన్నికల సంవత్సరంలో యువత తీసుకునే నిర్ణయాలు ఎంతో కీలకమన్నారు. భవిష్యత్తు బాగుండాలంటే మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఆయన సూచించారు. తమ ప్రభుత్వం ఉన్న సమయంలో తీసుకున్న ఎన్నోమంచి విధానాలు ఈ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. అన్నా క్యాంటీన్ ఎత్తివేసిందని, చెత్తకు పన్ను వేసే విధానం కొత్తగా తీసుకొచ్చిందని, ఇష్టానుసారంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుచేశారని మండిపడ్డారు. ఎలాంటి జీవనాధారం చూపించకుండా గాంధీనగర్ సమీపంలోని చిన్న పార్క్ వద్ద దుకాణాలు ఎత్తివేశారని చెప్పారు. తాము అధికారంలో ఉంటే ప్రజలు నష్టపోయే నిర్ణయాలు తీసుకోబోమన్నారు. కర్నూల్లో విద్యార్థులు చదువుకునేందుకు స్టడీ హాల్స్ నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉద్యోగాలు లేవని యువత అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. తన గెలుపే యువత భవిష్యత్తుకు మార్గం అవుతుందని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు అమలవుతున్న విధానాలను ప్రక్షాళన చేసి ప్రజలకు మేలు చేసే కొత్త విధానాలు అమల్లోకి తీసుకొస్తామన్నారు.

ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని పాలసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు నాగరాజు అధ్యక్షతన 20 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సెస్ పంపిణీ చేయడమైనది. ఇన్నర్ వీల్ తరుపున దుస్తులు అందించిన పోలేపల్లి రమాదేవి జనార్దన్ మాట్లాడుతూ విద్యార్థులు అనుసరించవలసిన మార్గాలు.. ప్రవర్తన తీరు, పెద్దలపట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. తలదించి చదివితే అది తలయత్తి బ్రతికేలా చేస్తుందన్నారు.ఇన్నర్ వీల్ అధ్యక్షులు లక్ష్మి దేవి, సెక్రటరీ ఉమాదేవి సభ్యులు మాధవి, కథ్యాయని, ఉషారాణి , శాంతమ్మ, విజయ లక్ష్మి, కవిత, వరలక్ష్మి రొటీరియన్ బైసాని రవి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

18న సిద్ధం కార్యక్రమానికి భారీగా తరలిరండి

విశాలాంధ్ర–ఎమ్మిగనూరు: ఈనెల 18న రాప్తాదులో జరుగు సిద్ధం కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయ వంతం చేయాలని వైసీపీ నా యకులు, కార్యకరల సమావేశం లో వైసీపీ సమన్వయకర్త బుట్టా రేణుక పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి ఆదే శాల మేరకు శిల్పా ఎస్టేట్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో బుట్టా రేణుక ఆధ్వర్యంలో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, ఇన్‌ఛార్జ్‌లతో ఈ నెల 18న అనంత పురం జిల్లా రాప్తాదులో జరగనున్న సిద్ధం కార్యక్రమంపై సమీక్ష సమావేశం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు.

రేమట రోడ్డును పూర్తి చేయాలి

విశాలాంధ్ర– కర్నూలు లీగల్ : మండలంలోని ఉల్చాల - రేమట వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణం అసంపూర్తి పనులను తక్షణమే పూర్తి చేయాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ నాగరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఉల్చాల – రేమట వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా, 2 కి.మీ. మేర వదిలేసారన్నారు. ఆ రోడ్డంతా గుంతల మయంగా ఉండటంతో వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొందన్నారు. స్పందించిన ఆర్‌అండ్‌బి ఎస్ఈ నాగరాజు మాట్లాడుతూ సంబంధిత నివేదికను ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు పంపుతామని హామీ ఇచ్చారని రవికుమార్ తెలిపారు.

జగన్ రెడ్డి అరాచకాలపై లోకేశ్ పూరించిన నాధమే 'శంఖారావం'

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాధమే శంఖారావమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర అన్నారు. సోమవారం టీడీఎ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్ రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేయనున్నారని తెలిపారు. నిరుద్యోగంతో యువత ఇబ్బందులు పడుతుండగా, ధరల పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు టీడీపీ 'శంఖారావం' అనే కీలక ప్రచారానికి శ్రీకారం చుట్టారన్నారు. నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా శంఖారావం చేపట్టనున్నారని, ఇందులో భాగంగా రానున్న 40-50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నారా లోకేష్ పర్యటించనున్నారని అన్నారు. ఒక్కరోజులో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమం జరుగుతుందన్నారు. శంఖారావం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను ఇంటరాక్టివ్ సెషన్స్ ద్వారా నోట్ చేస్తారన్నారు. శంఖారావం ద్వారా బాబు హామీ-భవిష్యత్తుకు హామీ కార్యక్రమంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంటికీ చేరువవుతారన్నారు. ఇప్పటికే యువగళం పాదయాత్ర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అన్నీ గ్రామాల్లో, పట్టణాల్లో నారా లోకేశ్ గారు పర్యటించారన్నారు. జగన్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై, అరాచక పాలనపై గొంతెత్తి ప్రజలకు మద్దతుగా నిలిచారన్నారు. వైఎస్సార్సీపీ నేతల అవినీతి, అన్యాయానికి వ్యతిరేకంగా 220 రోజుల పాటు 3132 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారని, జగన్ రెడ్డి ప్రభుత్వంలో బాధితులుగా మారిన అన్ని వర్గాల ప్రజలకు పాదయాత్ర ద్వారా నారా లోకేష్ భరోసా ఇచ్చారన్నారు. ప్రజలు తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నారని, త్వరలో చంద్రన్న పాలనా రాబోతుందన్నారు. పార్లమెంటు లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్,తెలుగు యువత ఉపాధ్యక్షుడు పేర పోగు రాజు,కోడుమూరు తెలుగు యువత అధ్యక్షుడు ఆదిత్య రెడ్డి,ప్రొఫెషనల్ వింగ్ పార్లమెంటు అధ్యక్షుడు భారత్ పాల్గొన్నారు.